వంతెనలు.. ప్రమాదాలకు నిలయాలు

- గ్రామాల్లో శిథిలస్థితికి చేరిన వారధులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

రౌతులపూడి: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కాలువలు, ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు, వంతెన పైకప్పులు పూర్తిగా శిథిలమవ్వడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీర్ఘకాలం క్రితం నిర్మించిన వంతెనలు కావడంతో పెచ్చులు ఊడిపోతున్నాయి. ప్రమదాలు జరిగినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెనల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండటం లేదని ప్రజలు నిరాశ చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని రౌతులపూడి-కత్తిపూడి ఆర్‌అండ్‌బీ రహదారిలో బంగారయ్యపేట శివారు అంగడాల గెడ్డ వద్ద బ్రిటిష్ వారి కాలంలో ఏర్పాటు చేసిన వంతెన పూర్తిగా శిథిమైంది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై గతంలో పశువులను రవాణా చేసే వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనేక



రౌతులపూడి-కత్తిపూడి రహదారిలో బంగారయ్యపేట వద్ద శిథిలమైన వంతెన

పశువులు మృతి చెందగా మరికొన్ని పశువులకు కాళ్లు విరిగి అంగవైకల్యం చెందాయి. అలాగే ఆరేళ్ల క్రితం ఆమార్గం గుండా ప్రయాణించే కారు అదుపుతప్పి కాలువలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు అదృష్టవశాత్తూ సురక్షితంగా బయటపడ్డారు. ఇదే వంతెనపై పలు దిచక్రవాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి.

రాళ్లకట్టు వద్ద..

రౌతులపూడి శివారు రాళ్లకట్టు వద్ద ఏర్పాటు చేసిన వంతెన సైతం ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వంతెనపై నల్లరాయిని తరలించే క్వారీలారీలు, ట్రాక్టర్లు అదుపు తప్పి బోల్తా పడ్డాయి.



రౌతులపూడి-ఎస్.పైడిపాల రోడ్డులో గుమ్మరేగుల ఏలేరు కాలువపై గోతులతో ఉన్న వంతెన

గుమ్మరేగుల వంతెన ఇలా..

రౌతులపూడి-ఎస్.పైడిపాల రహదారిలో గుమ్మరేగుల వద్ద ఏలేరు ఎడమ కాలవపై సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనపై వేసిన సిమెంట్ శ్లాబ్ పూర్తిగా శిథిలంకావడంతో ఎప్పుడు కూలితుందోనని ఆ మార్గంలో ప్రయాణించే వారు భయాందోళన చెందుతున్నారు. వంతెనపై గోతులు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే మండలంలోని రాజవరం-గంగవరం మార్గంలో ఏలేరు కాలువపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రమాదాలకు నిలయాలుగా మారిన వంతెనలపై తరచూ మంత్రులు, నాయకులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రయాణించినా కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి శిథిలస్థితికి చేరిన వంతెనల స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెనను పునర్నిర్మించాలి



అంగడాల గెడ్డ వద్ద బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన వంతెన పదేళ్ల క్రితం శిథిలమైంది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆ వంతెన స్థానంలో కొత్త వారధి నిర్మించాలని ఎన్నో పర్యాయాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకోలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టిసారించి వంతెన పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

కత్రి చిట్టిబాబు, స్థానికుడు, బంగారయ్యపేట

గుమ్మరేగుల వంతెనపై ప్రమాదాలు



గుమ్మరేగుల వద్ద ఏలేరు వంతెనపై నిర్మించిన వంతెన శ్లాబ్ బీటలు వేసింది. వంతెనపై పెద్ద పెద్ద గోతులు పడడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తాత్కాలికంగా శ్లాబ్‌పై నల్లరాయి బూడిదను వేసినా వర్షాలకు కొట్టుకుపోతుంది. దీంతో ప్రమాదాలు తప్పడం లేదు. తక్షణమే వంతెన శ్లాబ్ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

రాపర్తి రామకృష్ణ, సర్పంచ్, గుమ్మరేగుల

క్లుప్తంగా

గౌరీశంకరుల ఉత్సవాలు ప్రారంభం



జగపతినగరంలో గౌరీఅమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో గౌరీశంకరుల ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లోని ఉత్సవ కమిటీల సభ్యులు స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయాల్లో ప్రతిష్ఠించారు. పలువురు మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి వరి దుబ్బుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 40 రోజుల పాటు గౌరీశంకరులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న ఇద్దరి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.1500 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



కోటనందూరు పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కోటనందూరు: ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కోటనందూరు పోలీస్ స్టేషన్‌ను సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి పలు కేసులపై ఆరా తీశారు. స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతీ విషయాన్ని రికార్డుల్లో పొందుపరచాలని సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రజలతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై టి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గోల్డ్ మెడల్



ప్రతిభ చూపిన సాంబశివరావును అభినందిస్తున్న ఆదిత్య యూనివర్సిటీ సిబ్బంది

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థి కె.సాంబశివరావు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్ తెలిపారు. ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.సాంబశివరావు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో షాట్‌పుట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జూనియర్ నేషనల్ లెవెల్ పోటీలకు అర్హత సాధించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థి సాంబశివరావును డీన్ ఎ.మాధవరావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ మురళి మోహన్, కె.శేఖర్ తదితరులు అభినందించారు.

అరుణాచల క్షేత్రంలో విశేష పూజలు



విశేష అలంకరణలో అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో అపిత కూచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరం, తిరుమాలి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ మండలంలోని జె.అన్నవరంలో 9.09 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు భూస్వాములు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. పేదలకు దక్కాల్సిన భూమిని ప్రభుత్వం కళ్లుకప్పి దోచుకుంటున్నారని విమర్శించారు. తిరుమాలిలో భూదాన భూమిని కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. వీటిపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోమాల కుశల, మసిరపు రాజారావు, లక్ష్మీ, పాదాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

ఉద్యోగ భద్రత కోరుతూ వలంటీర్ల ఆందోళన

ప్రత్తిపాడు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం చెల్లించాలంటూ ప్రత్తిపాడులో సోమవారం గ్రామ వలంటీర్లు ఆందోళన చేపట్టారు. ఏపీ గ్రామ/వార్డు వలంటీర్ల యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగాఇ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలో వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. వేతనాలు లేక వలంటీర్ల జీవితాలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకుని, జాబ్‌చార్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తొలి దశగా ఈ నెల 28న జిల్లా కేంద్రంలో తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు అందజేశారు. వలంటీర్ల సంఘ నాయకులు నానిపల్లి జాకబ్, మొరుకుర్తి సతీష్‌కుమార్, ఎం.అనిత, కె.రాజేష్, ఎల్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పూర్తి



ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులు

తుని రూరల్: మండలంలోని డి.పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు విజయవంతంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినట్టు హెచ్‌ఎం ఇంజమూరి శ్రీరామచంద్రమూర్తి సోమవారం తెలిపారు. దసరా సెలవులు 12 రోజులూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ సర్వీస్ సేవలు, గ్రామ సచివాలయ సేవల్లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారన్నారు. దీంతో పదో తరగతి స్థాయిలోనే నైపుణ్యాభివృద్ధి, వివిధ సేవలపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. పదో తరగతి తర్వాత ఏ చదువులు చదవాలో అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థులు ఒకేషనల్ ఉపాధ్యాయుడు లెక్కల గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటర్నషిప్ చేశారని తెలిపారు.

రసాభాసగా సొసైటీ సమావేశం

కిర్లంపూడి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ మీటింగ్ రసాభాసగా మారింది. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి (అసిస్టెంట్ రిజిస్టర్) ఎం.శ్రీరంగనాయకులు ఆధ్వర్యంలో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. రైతులు తమ పొలాలపై తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించినప్పటికీ వారి పేరు మీద ఇంకా బాకీలు చూపించడంపై వివరణ ఇవ్వాలని మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు అధికారులను నిలదీశారు. దీనిపై గత కొంతకాలంగా జరుగుతున్న విచారణను ఓ కొలిక్కి తేకుండా కాలయాపన చేస్తున్న అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీలో రుణాలు తీసుకున్న రైతుల వివరాలు కార్యాలయం వద్ద ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. దీనిపై శ్రీరంగనాయకులు మాట్లాడుతూ ఆరునెలలకు ఒకసారి నిర్వహించే జనరల్ బాడీ మీటింగ్‌ను సోమవారం ఏర్పాటు చేశామన్నారు. కోరం లేక పోవడంతో సమావేశాన్ని రద్దు చేసినట్టు తెలిపారు. రైతులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ పంపన వెంకటరమణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



సొసైటీలో రైతుల అప్పుల వివరాలపై అధికారులను నిలదీస్తున్న రైతులు

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

ఏలేశ్వరం: మానవ హక్కుల నేత, ప్రొఫెసర్ సాయిబాబా మృతికి పట్టణంలో సోమవారం సంతాపం తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల క్వారీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కుప్పల నాగభూషణం ఆధ్వర్యంలో స్థానిక క్వారీ కార్మిక భవనంలో సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే నెపంతో తొమ్మిదేళ్ల పాటు సాయిబాబాను జైల్లో పెట్టారని ఆరోపించారు. 90 శాతం అంగవైకల్యం ఉన్నా సాయిబాబా పేదల కోసం పోరాటాలు చేశారని కొనియాడారు. సాయిబాబా మృతి పేదలకు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల రాజబాబు, నీలపల్లి సుబ్బారావు, దేరంగుల రాజు, పండు, లోవరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు

ఘనంగా సత్యదేవుని నిత్య కల్యాణం



రత్నగిరిపై సత్యదేవుని నిత్యకల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని నిత్యకల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. పండితులు ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం నుంచి నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అక్కడ కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నిత్యకల్యాణాన్ని ప్రారంభించారు. ఉదయం 11 గంటల వరకూ మంగళసూత్రధారణ, తలంబ్రాలు, స్వామి, అమ్మవార్లకు వేదపండితుల ఆశీర్వచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మల్లిసాలలో 17 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

జగ్గంపేట: మండలంలోని మల్లిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2007 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 17 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే విద్యార్థులు కలుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కలయతిరిగారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు తాతారావు, చక్రధర్, సతీష్, ఆంజనేయులు, అచ్యుత్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు తొట్టిపూడి రాజా, మిరియాల బద్రి, గజ్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ వర్కర్లకు రాజకీయ వేధింపులు

గండేపల్లి: పాఠశాలల్లో మిడ్డే మీల్స్ వర్కర్లను రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని మిడ్డే మీల్స్ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.ఈశ్వరి ఆరోపించారు. మండలంలోని సింగరంపాలెంలో గత కొన్నేళ్లుగా మిడ్డే మీల్స్ వర్కర్లుగా పని చేస్తున్న నొక్కు నూకరత్నం, రాండి నాగమణిలను తొలగించడంపై సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులకే గ్రామస్థాయిలో నాయకులు ఉద్యోగులను వేధింపులకు గురి చేయడంతో పాటు కక్ష్యపూర్వకంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కారణం లేకుండా తొలిగించిన నూకరత్నం, నాగమణిలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ సభ్యులు లలిత, గంగ, గంగూరి మరియమ్మ, మిడ్డే మీల్స్ వర్కర్లు పాల్గొన్నారు.



సింగరంపాలెంలో నిరసన తెలుపుతున్న మిడ్డే మీల్స్ వర్కర్లు

ధర్మవరంలో అన్నదానం

ప్రత్తిపాడు రూరల్: దేవీ నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మండలంలోని ధర్మవరం సత్తెమ్మతల్లి ఆలయం వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. తొలుత సత్తెమ్మతల్లికి పండితులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అమ్మవారి ఆలయం వద్ద పలు రకాల వంటకాలతో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, ప్రయాణికులు భారీ ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు ఆరు వేల మంది అన్నప్రసాదం స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గాయపడిన యువకుడికి న్యాయం చేయాలి

గోకవరం: ప్రైవేటు మైనింగ్ కంపెనీలో పని చేస్తూ గాయపడిన దళిత యువకుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక దళిత నాయకుడు వరసాల ప్రసాద్ సోమవారం గోకవరంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వీరమర్ల కార్తికేయ ప్రైవేటు మైనింగ్ కంపెనీలో పని చేస్తూ నాలుగు నెలల క్రితం కోరుకొండ మండలం బూరుగుపూడి గేటు వద్ద ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లిపోయాడన్నారు. కానీ ఇప్పటివరకూ బాధితుడికి సదరు మైనింగ్ కంపెనీ ఎటువంటి ఆర్థిక సహాయం అందించలేదన్నారు. ఎక్కువగా ఈ మైనింగ్ కంపెనీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ యువకులు పని చేస్తున్నారని, వారికి ప్రమాదాలు జరిగితే యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై మైనింగ్ యాజమాన్యం వెంటనే స్పందించి గాయపడిన యువకుడికి న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ నిరాహార దీక్షలో దళిత, ఇతర నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



గోకవరంలో నిరాహార దీక్ష చేస్తున్న దళిత నాయకుడు ప్రసాద్ తదితరులు

సంక్రాంతి నాటికి 'సూపర్ సిక్స్' అమలు

గోకవరం: వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి సూపర్ సిక్స్ పథకాలు అన్నింటినీ అమలు చేస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోకవరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గోకవరం మండలానికి రూ.10.50 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. కాగా ఉదయం కామరాజుపేటలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ పాల్గొని ఎమ్మెల్యేతో కలిసి సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు గాజింగం సత్తిబాబు, అడపా భరత్‌బాబు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం

ప్రత్తిపాడు/రౌతులపూడి: పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఏలూరులో రూ.10 లక్షలు, చినశంకర్లపూడిలో రూ.16 లక్షలు, పెదశంకర్లపూడిలో రూ.13 లక్షలతో రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అలాగే రౌతులపూడి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, ప్రత్తిపాడు మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కామరాజుపేటలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఉదయశ్రీనివాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగులకు)కు మంగళవారం ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు సోమవారం తెలిపారు. ఆగస్టు నెలలో ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఉపకరణాలకు అర్హులను ఎంపిక చేసిందన్నారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని చెందిన 209 మందిని ఎంపిక చేశారని వివరించారు. వారికి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఉపకరణాలను అందజేస్తారని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు.

సారాతో ఇద్దరి అరెస్టు

రౌతులపూడి: మండలంలో ఎస్ఎస్ పట్నంలో సారా తయారు చేస్తున్న చిన్ని శ్రీను, ఏనుగుపల్లి అప్పారావులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై వెంకటేశ్వరావు సోమవారం తెలిపారు. వారి నుంచి 80 లీటర్ల సారా, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

తీరంలో అలజడి

- ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలలు
- తుపాను హెచ్చరికలతో రైతుల ఆందోళన

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. మండలంలోని అద్దరిపేట నుంచి కొత్తపోడిపల్లిపేట వరకూ ఉన్న తీరంలో అలలు రెండు మీటర్ల వరకూ ఎగసి పడుతున్నాయి. తుపానుపై తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్టు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. ఇప్పటికే సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లను దగ్గరలోని సురక్షిత తీరాలకు చేర్చాలని సమాచారం అందించామన్నారు.

అన్నదాతల్లో ఆందోళన

ఇటీవల కురిసిన కుండపోత వర్షాలు, వరదల ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదల నుంచి తేరుకోకముందే మళ్లీ తపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే పంటలు మునిగి దెబ్బతిన్నగా మెట్ట, పల్లపు ప్రాంతాల్లో పంటలన్నీ తెగుళ్లబారిన పడ్డాయి. వాటిని రక్షించుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ తుపాను ప్రభావానికి గురైతే తీవ్ర నష్టం తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



దానవాయిపేట సముద్ర తీరంలో ఎగసిపడుతున్న అలలు